


## నెలనెలా నవ్వుల పండగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి స్పెషల్

టివి అబ్సర్డ్ వాళ్ళు ఒక తాగుబోతుని ఇంటర్వ్యూ చేసినప్పుడు అతనిచ్చిన సమాధానాలు.

*ప్రశ్న: తాగుడువల్ల మీ పని గంటలవేళ తగ్గుతుందా?*

జవాబు: సాధారణంగా సోమవారాలు మాత్రమే అలా జరుగుతూ ఉంటుంది.

*ప్రశ్న:మీ మిత్రులంతా అడిగారని తాగుతారా? లేక మీకు తాగాలనిపించా?*

జవాబు: నా స్నేహితులు అడిగారనే తాగుతాను. కాకపోతే నాకు తాగాలనిపించినప్పుడల్లా తాగుదామని అడిగే మిత్రుడి దగ్గరకు వెళ్ళి తాగుతుంటాను

*ప్రశ్న:తాగుడువల్ల మీ గౌరవం ఎఫెక్ట్ అవుతుందా?*

జవాబు: తప్పకుండా. మందుకొట్టాక నా మిత్రుడి తాతగారి కట్టుడు పళ్ళతో చెక్కభజన చేస్తూ, లవకుశలోని ఓ పాటపాడితే అదెంతో అద్భుతంగా వుందని తోటివాళ్ళు మెచ్చుకున్నారు. ( మా ఫ్రెండ్ మాత్రం మళ్ళీ నన్ను మందుపార్టీకి పిలవనన్నాడు)

*ప్రశ్న: తాగుడువల్ల మీ ఆర్థిక పరిస్థితి కష్టాలపాలయ్యిందా?*

జవాబు: లేదు కదా.. మెరుగయ్యింది. ఎవరి దగ్గర ఎలా అప్పు తీసుకోవాలో అనే నైపుణ్యం పెరిగింది.

*ప్రశ్న: ఒంటరిగా తాగడం అలవాటా?*

జవాబు: సాధ్యం కాదు. బార్ లో ఉన్నవాళ్ళను బయటికి పొమ్మనలేం కదా!

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"నమస్కారమండీ యల్లయ్యగారూ! మీ విషయమై నేను చాలా బాధపడ్డానండీ. ఎన్నో వేల రూపాయల విలువ చేసే మీ కట్టెల డిపో కాలిపోయిందటగా పాపం. మరి ఇప్పుడేం చేస్తున్నట్లు?" అని పరామర్శించాడు పరాంకుశరావు.

"బొగ్గుల యాపారం" అన్నాడు యల్లయ్య తాపీగా చుట్ట పొగను గాలిలోకి వదుల్తూ.

"ఏమండీ ఈ రోజు మన పెళ్ళిరోజు కదా! నాకేదైనా నెక్లెస్ బహుమతిగా తేలేకపోయారా?" అంది భార్య.

"నీకు నెక్లెస్ తెద్దామని రెండుసార్లు నగల అంగడికి వెళ్ళానే. వెధవలు రాత్రి పదైనా అంగడి ఇంకా తెరిచే వున్నారు" అన్నాడు విసుగ్గా.

ఆఫీసులో అందరూ అడగమని పోరు పెడితే ధైర్యం తెచ్చుకుని అడిగేశాడు తన ఆఫీసర్ని జీతం పెంచమని.

"నీ జీతం ఎప్పుడో పెంచాను కదయ్యా" అన్నాడాఫీసరు.

"అలాగా! నా భార్య ఆ విషయం చెప్పనే లేదు సార్" అన్నాడు ఆ భార్యా విధేయుడు.

"ఏరా నీ భార్య ఊళ్ళో లేదుగా హాయిగా సంతోషంగా వుండాల్సిందిపోయి, ఇలా గడ్డం పెంచి పిచ్చోడిలా తిరుగుతున్నావేంటీ?"

"ఏం చేయమంటావురా! నేను ఊళ్ళో లేకపోతే నీకు షోకులెందుకని మా ఆవిడ నా రేజరు వగైరాలు తన వెంట తీసుకుని పోయిందిరా"

"డాక్టరుగారూ మా వారు నోట్లో నుండి గుప్పు గుప్పున పొగను రింగులుగా వదులుతున్నారు"

"దాందేముంది, పొగను చాలామంది సిగరెట్టు ప్రియులు అలాగే తెప్పిస్తారే"

"కానీ, ఆయనసలు సిగరెట్లే కాల్చరండీ."

"మీ అమ్మాయి సంగీతం నేర్చుకోడం నిజంగా మా అదృష్టం"

"ఏం?"

"అందువల్లేకదా మీ పక్కిల్లు ఎంతో చవకగా కొనగలిగాం"

ఇద్దరు స్నేహితులు కలసి హోటలుకెళ్ళారు. కావలసినవన్నీ తెప్పించుకుని బాగా తిన్నారు. చివరగా కాఫీలొచ్చాయి. తాగబోయేసరికి కాఫీలో ఈగలు కనిపించాయి. వారికి వెంటనే కోపం వచ్చింది. మేనేజర్ని కేకేసి ఆయనమీద కూకలేసారు. శుచి శుభ్రత లేని హోటలన్నారు. పైకి రిపోర్టు చేస్తామన్నారు.

మేనేజరు బాగా భయపడి పోయాడు. "పోనీండి సార్ పొరపాటైంది. ఇక మీద ఇట్లాంటివి జరగకుండా జాగ్రత్తపడతాం. ఎవరైనా వింటే మా వ్యాపారం దెబ్బతింటుంది" అంటూ వారిని బ్రతిమలాడ్తూ డబ్బులు కూడా తీసుకోకుండానే పంపేశాడు.

"ఏరా ఇక ఇంటికెళ్దామా?" అన్నాడొకడు.

"ఇంకా ఆకలిగానే వుందిరా! వేరే హోటల్‌కి పోదాం పద. ఇంకా నా దగ్గర రెండు ఈగలు మిగిలి వున్నాయి" అన్నాడు రెండోవాడు.

"సార్ మీరు ఎరుపు రంగు చొక్కా వేసుకు వచ్చారా ఏమిటి?" అనడిగాడు మంగలి ఆదుర్దాగా.

గడ్డం చేయించుకుంటున్న వ్యక్తి "లేదే ఎందుకడుగుతున్నావ్?" అన్నాడు.

"ఉండండి, ముందు డాక్టర్ని పిలుచుకొస్తాను" అని పరిగెత్తాడు మంగలి.

కుటుంబరావుకి ఈ మధ్య రాత్రిళ్ళు నిద్ర పట్టడంలేదు. అందుకని డాక్టర్ని కలవడానికి వెళ్ళాడు. డాక్టరు అసలు విషయం ఏంటని అడిగాడు. "రాత్రిళ్ళు పడుకునేప్పుడు మంచం కింద ఎవరో వున్నట్లుగా వుంటుందండీ. ఎవరా అని మంచం కిందకెళ్ళి చూస్తే మంచం మీద ఎవరో వున్నట్లుగా వుంటుంది. తీరా చూస్తే ఎవరూ వుండరు. ఈ విధంగా వుదయంవరకూ పైనుంచి కిందికి కిందినుంచి పైకి తిరగడమే సరిపోయేది. ఇంక నిద్రేం పడ్తుంది?" అన్నాడు.

ఆ నిద్ర స్పెషలిస్ట్ ఇదంతా విని "ఇది ఒక విచిత్రమైన రోగం. దీన్ని కుదర్చడానికి ఆరువందల రూపాయలు ఖర్చవుతుంది" అన్నాడు.

"ఉండండి మా ఆవిడనడిగి వస్తాను" అని కుటుంబరావు వెళ్ళాడు.

అంతే పదిరోజులయినా తిరిగి రాలేదు.

ఒకరోజు డాక్టరుకు కుటుంబరావు బజారులో కనిపించాడు. "ఏమండీ మళ్ళీ వస్తానని రాలేదు. జబ్బు నయమయిందా?" అన్నాడు.

"ఏముందీ? 'ఈ రోగానికి ఆరువందలా? రేపటినుంచి చాపమీద పడుకో ' అంది మా ఆవిడ అంతే" అన్నాడు కుటుంబరావు.

తన కథ రాసిన సినిమా విడుదలయిన మొదటిరోజే మార్నింగ్ షోకి వెళ్ళాడు కవి. తెరమీద తన పేరు కనిపించేసరికి పొంగిపోయాడు. కానీ తాను రాసిన కథకు ఈ సినిమా కథకు పోలిక ఏమీ కనిపించలేదు. వెంటనే నిర్మాత వద్దకు పరుగెత్తి పోయాడు. "ఏంటిసార్ అది నా కథేనా?" అన్నాడు అనుమానంగా కవిగారు.

"నీదేనయ్యా! నేను, డైరక్టరు సంభాషణల రచయిత, అసిస్టెంటు డైరక్టరు, హీరో హీరోయిన్ మొదలగు వాళ్ళందరి సలహాలు చేర్చి తీసేసరికి కథ మారిపోయివుండచ్చు. పోనీ, నీ అసలు కథతో ఇంకొక సినిమా తీస్తాలే" అన్నాడు నిర్మాత కారా కిళ్ళీ నములుతూ.

COMMENTS